కథ

# గాజుగోళం

పాలపర్తి జ్యోతిష్మతి



రమకు మనసంతా దిగులుగా ఉంది.

'తనకెందుకు అట్లా ఉందో తనకే అర్థం కావట్లేదు. ఒంటరితనం తనను భయపెడుతోందా? ఇన్నాళ్ళూ లేనిది ఇవాళ ఇప్పటికిప్పుడు ఎందుకొచ్చిందా భయం? భానుకి ట్రాన్స్‌ఫర్ అయి వెళ్ళిపోయింది. ఇంక ఈ ఇంట్లో తనొక్కతే. అయితే మాత్రం తనకేంటి భయం?

'భానుకూ, తనకూ ఇంటర్ చదివేటప్పుడు కలిసింది స్నేహం. ఉద్యోగం కూడా ఇద్దరికీ ఒకే ఊళ్ళో రావడంతో ఒకే ఇంట్లో కలిసి ఉన్నారు ఇన్నాళ్ళూ. నాలుగు నెలల క్రితం భానుకి పెళ్ళయింది.

'పెళ్ళి విషయంలోనే భానుకీ, తనకీ గొడవ. తనకి పెళ్ళి చేసుకోవడం ఇష్టం లేదు. భానూ ఏమో 'అట్లా కుదరదు. ప్రతి మనిషి జీవితంలో పెళ్ళి తప్పనిసరి' అంటుంది. ఇష్టమైన వాల్ళు చేసుకుంటారు. వాళ్ళ ఇష్టాలని తనమీద రుద్దాలని చూస్తారెందుకు? ఒకవేళ అమ్మానాన్నా తనని ఒప్పించమని భానుకి చెప్పారేమో ? తన ఇష్టానికి విలువలేదా? అయినా మగవాడి అధికారాన్ని తను భరించలేదు. అత్తగారి పెత్తనానికి తల వంచలేదు. తనకెందుకా గొడవ. హాయిగా ఉద్యోగం చేసుకుంటోంది. తన బతుకు తను బతక గలదు. భాను అంటుంది 'అత్తగారిని ఒక రాక్షసిలా ఊహించుకుంటావెందుకు? అత్తమీద జులుం చేసే

కోడళ్ళు ఎంతమంది లేరు? భర్తని మొట్టికాయ వేసి కూర్చోబెట్టే భార్యలు మాత్రం లేరా?' అని. తనకి ఆ ఆధిపత్యం కూడా అక్కర్లేదు. అయినా భార్యాభర్తల్లో, అత్తాకోడళ్ళలో ఎవరో ఒకరిమీద ఇంకొకరు అధికారం చెలాయించాల్సిందేనా? ఎవరికి నచ్చిన విధంగా వాళ్ళు స్వేచ్ఛగా ఉండడానికి కుదరదా ?

'తనకి కావలసింది స్వాతంత్ర్యం. తనకి నచ్చినట్టు తను ఉండగలగాలి. దానికి పెళ్ళి ఒక అడ్డంకి అనే తన అభిప్రాయం. దానికి ఎవరూ ఒప్పుకోరు. పోతేపోనీ. వాళ్ళగొడవ తనకనవసరం. తన జోలికి రాకుండా ఉంటే చాలు. కానీ ఎవరూ అట్లా ఉండరు. అందరూ తనకి బోధించేవాళ్ళే.

'భాను పెళ్ళయ్యాక కూడా తనకేమీ అనిపించ లేదు. ఇద్దరూ కలసి ముందులాగానే ఈ ఇంట్లోనే ఉన్నారు, ఈ నాలుగు నెలలూ. పెళ్ళయ్యాక ఇక్కడే ఎన్నాళ్ళుంటుంది? ట్రాన్స్‌ఫర్ చేయించుకుంది. సాయంత్రమే మూటాముల్లే తీసుకుని వెళ్ళిపోయింది. ఇన్నాళ్ళూ కలిసి ఉన్న స్నేహితురాలు దూరంగా వెళ్ళి పోయిందని బాధపడుతోందా తను? లేకపోతే ఇక ముందు ఒంటరిగా ఉండాలని భయపడుతోందా?

'పెళ్ళి గురించి అమ్మ, నాన్న, భాను, ఇంకెవరైనా – అందరూ చెప్పేది ఒకటే. 'జీవితానికి ఒక తోడు అవసరం'. ఏం? పెళ్ళి చేసుకుంటే నేనా తోడు దొరికేది? స్నేహితులు తోడుగా ఉండలేరా? ఆ ! ఎక్కడుంటారులే ! భాను ఏం చేసింది? ఎవ్వరైనా అంతే. ఎవరి దారి వాళ్ళు చూసుకుంటారు. ఇంక తను ఒంటరిదేనా? అయితే మాత్రం తనకేం భయం? తను ఒంటరిగానైనా బతకగలదు. కానీ పెళ్ళి మాత్రం చేసుకోదు.

వాళ్ళు చెప్పే ఇంకొకమాట 'ఆడదానికి మగాడి రక్షణ అవసరం.'

'ఆ మాటంటేనే తనకి మండుకొస్తుంది. ఇదేమైనా సినిమానా? వందమంది రౌడీలని ఒంటి చేత్తో చితకబాదెయ్యడానికి. కట్నంకోసం కాల్చుకు తినడం, అడుగడుగునా అనుమానాలూ,అవమానాలూ – ఇవేగా మగాడినుండి ఆడదానికి దొరికేవి. అరె! ఆడవాళ్ళు కూడా అర్థం చేసుకోరేంటి? పెళ్ళి చేసుకోక పోతే అసలు జీవితమే లేదన్నట్టు మాట్లాడతారు.

"పురాణకాలంలో రాక్షసులు శత్రువు, శత్రువు అనుకుంటూనే అనుక్షణం హరినామస్మరణ చేసినట్టు తను కూడా వద్దు, వద్దు అనుకుంటూనే ఎప్పుడో ఆ బంధంలో ఇరుక్కుపోతుందా?

'ఎందుకివాళ మనసంతా ఇంత గందర గోళంగా ఉంది? మాటిమాటికీ పెళ్ళి ఆలోచన వస్తోంది. ఊరికే ఆలోచిస్తోందంతే. తనకి పెళ్ళి చేసుకోవాలన్న కోరిక లేదు. తను ఆ ఊబిలోకి దిగదు.

'ఇట్లా మనసు బాగా లేనప్పుడు పెంపుడు జంతువులతో ఆడుకుంటే రిలీఫ్‌గా ఉంటుందట. ఎక్కడో చదివినట్టు గుర్తు. అయినా తనకి పెంపుడు జంతువు లేమున్నాయి?

"తనకి సాఫ్ట్ టాయ్స్ అంటే చాలా ఇష్టం. రకరకాల జంతువుల బొమ్మలతో షోకేసంతా నింపేసింది కదా!జంతువులు లేకపోతే ఏం? బొమ్మల తోటే ఆడుకుంటే సరి. భాను అనేది 'ఇదేం పిచ్చి నీకు? చిన్నపిల్లలా కనిపించినబొమ్మల్లా కొంటావు' అని. తను నిజంగానే చిన్నపిల్లలా ఏమి తోచనప్పుడల్లా ఆ బొమ్మలతో ఆడుకుంటూ ఉంటుంది. కానీ ఇప్పుడు వాటితో ఆడుకోవాలని పించట్లేదు.

'అవునూ ! తనకి రోజూ చూసీ చూసీ ఆ బొమ్మలంటే విసుగొచ్చేసింది కదా ! మరి రోజూ చూసుకునే మొగుడూ పెళ్ళాలకి ఒకళ్ళంటే ఒకళ్ళకి విసుగు పుట్టదా?ఎందుకు పుడుతుందిలే ? పాతికేళ్ళు ఒకేచోట కలిసున్నాం గదా అని అమ్మానాన్నా తనకి బోరుకొడతారా?ఎప్పుడెప్పుడువాళ్ళదగ్గరికి వెళదామా అనిపిస్తూ ఉండదూ ? భార్యాభర్తలైనా అంతే గదా.

'ఛ ! ఏమిటివాళ మనసు మాటిమాటికీ పెళ్ళివైపు పోతోంది? ఏది ఏమైనా తను మాత్రం పెళ్ళి చేసుకోదు. ఆ జీవితంలో తను ఇమడలేదు.

'సరే ! ఆ బొమ్మల్తోటే కాసేపు గడిపితే సరి.

'కుక్కలూ, పిల్లులూ, కోతులూ, టెడ్డీబేర్స్ – ఎన్ని బొమ్మలో తన దగ్గర. కానీ దేనిమీదా మనసు నిలపలేకపోతోందివాళ.

'సమయానికి భలే గుర్తొచ్చింది వరండాలో పెట్టిన బొమ్మ. ఆ బొమ్మ కొనుక్కోవడమే ఒక థ్రిల్. భాను పెళ్ళికి కరీంనగర్ వెళ్ళినప్పుడు ఎంతో మోజుపడి కొనుక్కుంది దాన్ని. హైదరాబాద్ నుండి కరీంనగర్ వెళ్తుంటే ఊరిబయట రోడ్డు పక్కనే పెట్టుకుని అమ్ముతున్నారు, రకరకాల సైజుల్లో రకరకాల జంతువుల బొమ్మలు. వాటిలో పులిబొమ్మ తనకెంత నచ్చిందో ! అదీ చిన్నా చితకా బొమ్మ కాదు. లైఫ్ సైజ్ ! నిజం పులిలానే ఉంది. ఎట్లాగైనా దాన్ని కొనుక్కోవాలనుకుంది. తిరిగి వచ్చేటప్పుడు హైదరాబాదు బస్టాండు నుంచి దానికోసమే ప్రత్యేకంగా ఆటో వేసుకుని వెళ్ళింది. ఆటోకే రెండొందలైంది. ఎంతైతే ఏం? తనకు నచ్చినదాని కోసం తనేమైనా చేస్తుంది. ఈ స్వాతంత్ర్యం కోసమే కదా తను ఒంటరి జీవితాన్ని ఎంచుకుంది.

'మూడు వేలు చెప్పాడు దాని ఖరీదు. మొదట 'అమ్మో ! అంతా?' అనిపించింది. కానీ వదలబుద్ధి కాలేదు. 'పట్నంలో పెద్దషాపుల్లో అయితే ఏడెనిమిది వేలకు తక్కువ చెప్పరు' అన్నాడు. తనకి బేరం చెయ్యడం కూడా అంతగా తెలీదు. అయినా ఎట్లాగో రెండువేల అయిదు వందలకు అడిగితే ఇచ్చాడు. ఆ బొమ్మని సొంతం చేసుకున్న క్షణాన తనకెంత గర్వంగా అనిపించిందో ! ఏదో అపురూపమైన వస్తువు తన దగ్గరున్నంత ఆనందం !

'దాన్ని ఇంటికి తీసుకురావడానికి ఎన్ని తిప్పలు పడింది తను ! చూసిన వాళ్ళంతా 'ఎంత?'



కవి సమయం, శ్రీ త్యాగరాయ గానసభల సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాదులోని కళా సుబ్బారావు కళావేదికపై జరిగిన సభలో యువకవి శ్రీ బి.ఎస్.ఎం. కుమార్ రచించిన 'నిఘాలు... వృత్తాలు... వెల్తురాలిన కళ్ళు" కవి సంపుటిని ఆవిష్కరిస్తున్న డా॥ అద్దేపల్లి రామమోహనరావు. చిత్రంలో ఆదెపు లక్ష్మీపతి, సుమనశ్రీ, గ్రంథకర్త, సుధామ, తాళ్ళపల్లి మురళీధరగౌడు, కళా వేంకట దీక్షితులు ఉన్నారు.

అమ్మో ! అంతా ?' అంటారు. అది తన కిష్టం లేదు. సడెన్‌గా చూస్తే భయపడతారేమో కూడా. అందుకే దుప్పట్లో మూటకట్టి లోపల ఏముందో ఎవరికీ తెలియకుండా తెచ్చింది.

'ఆరోజు బస్సులో తనకెంత నవ్వొచ్చిందో. ప్రతి ఒక్కరూ 'మూట మోసుకుపోతోందేంటి? పల్లెటూరి గబ్బిలాయిలా' అన్నట్టు చూశారు తనవైపు. ఆరోజు బస్సు ఖాళీగా ఉంది కాబట్టిసరిపోయింది. లేకపోతే తనకి చాలా ఇబ్బంది అయ్యేది. ఆ మూట బస్సు పైన పడెయ్యమని కండక్టరు ఒకటే గోల. అది ఎంత ప్రత్యేకమైన వస్తువో అతనికేం తెలుసు? చివరికి దానికి కూడా టికెట్టు తీసుకుని దాన్ని ఒళ్ళోనే పెట్టుకుని కూర్చుంది.

'ఇంటికి రాగానే దాని కోసం ఒక టేకు టీపాయ్ కొని మెష్ వరండాలో ఒక పక్కగా పెట్టింది. ఎంత ఠీవిగా ఉందో దాని మీద కూర్చోపెడితే.

'ఇప్పుడంటే అలవాటు పడిపోయారు కానీ, మొదటిరోజు దాన్ని చూసిన వాళ్ళంతా అదిరి పోయారు. తరువాత కూడా చాలారోజులు వీధిన పోయే వాళ్ళంతా ఆగి భయం భయంగా కాసేపు చూసి 'బొమ్మ !' అనుకుంటూ వెళ్ళేవాళ్ళు.

'భానుకి దాన్ని ఇంట్లోఉంచడం అస్సలు ఇష్టం లేదు. 'అంత ఖరీదు పెట్టి దాన్ని కొనడమే కాకుండా దానికొక టేకు సింహాసనం కూడానా? నీకు పిచ్చి బాగా ముదిరిపోయింది. నిన్నింక వైజాగ్ పంపించాల్సిందే' అంటూ ఏదేదో మాట్లాడింది.

'వరండాలో ఉన్నది పులిబొమ్మే అని తెలిసి కూడా ఒకరోజు అర్ధరాత్రి లేచి దాన్ని చూసి భయపడి ఎంతగోల చేసింది ! తనకు మాత్రం ఆ బొమ్మంటే ప్రాణం. ఎటువంటిపరిస్థితుల్లోనూ దీన్ని వదులుకోదు.

'సరే ! వెళ్ళి కాసేపు దాంతో ఆడుకుంటే బాగుంటుంది కదా !

'అమ్మో ! ఏంటి ఇవాళ ఈ బొమ్మ తనకే ఇంత భయంకరంగా కనిపిస్తోంది ? నిజం పులిలా, మీదపడి మింగేసేలా ఆ చూపులేంటి? కాదు. అది ఉత్త బొమ్మే. తను ఎంతో ముచ్చటపడి కొనుక్కొన్న బొమ్మ. దాన్ని చూసి తను భయపడడమేంటి?

'ప్చ్ ! దగ్గరికెళ్ళడానికి ధైర్యం చాలట్లేదు. ఎప్పుడూ లేనిది ఏమిటివాళ ఒంటరితనంలానే ఈ బొమ్మా తనను ఇంత భయపెడుతోంది?

'వీల్లేదు. తనకు ఒంటరితనమంటే భయం లేదు. పులి బొమ్మంటే భయం లేదు.'

రమ టీపాయ్ పక్కన కూర్చుని పులిబొమ్మను చేతుల్లోకి తీసుకుంది. సూటిగా దాని కళ్ళలోకి చూసింది. మెల్లగా వెనక్కి వాలిపోయింది. పులిబొమ్మ బరువుగా రమ మీద పడింది. రమ గుండె ఆగి పోయింది.


మీ అక్షరాలను అచ్చు వేయాలనుకుంటే

పోస్ట్‌ద్వారా గాని, ఫోన్‌ద్వారా గాని సంప్రదించండి.

అందంగా, గ్రంథంగా ప్రచురించి మీ కందిస్తాం

**చినుకు ప్రచురణలు**




**చినుకు ప్రచురణలు**

దత్తాస్ నయాబజార్, రాజ్ యువరాజ్ థియేటర్స్ ఎదురుగా,
గాంధీనగర్, విజయవాడ - 520 003.
✆ 0866-6640595 , సెల్ : 98481 32208
Fax No. 0866-6697375 : : E-mail : editor_chinuku@yahoo.com